## ■ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



వికారాబాద్, జూలై 12 : రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వికారాబాద్ ప్రాంతానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, 18 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ మొత్తం 45 మందికి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఇన్‌చార్జి కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ■ చక్కటి విద్యాబోధనతో మంచిపేరు తెచ్చుకోవాలి



పరిగి, జూలై 12: బదిలీపై వెళ్లిన పాఠశాల విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేసి మంచిపేరు తెచ్చుకోవాలని పరిగి మండల విద్యాధికారి హరిశ్చంద్ర సూచించారు. పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నెం.1 పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతులు, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం మండల విద్యాధికారి హరిశ్చంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన పాఠశాలలో చక్కటి బోధన ద్వారా విద్యార్థుల హృదయాలలో చోటు సంపాదించాలని చెప్పారు. సమాజా నికి ఉత్తమ పౌరులను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ■ వైభవంగా బోనాలు..



కులకచర్ల, జూలై 12 : కులకచర్ల మండల కేంద్రంలో చాపలగూడెం గ్రామ మత్స్యకారుల సంఘం డైరెక్టర్స్ పేర్కంపల్లి మొగులయ్య, గండి సిద్ధయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా బోనాలు నిర్వహించారు. చాపలగూడెంకు చెందిన మహిళలు అమ్మవారికి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం సభ్యులు పెద్ద గుంటి సాయన్న, చిట్టిల ఎంకప్ప, గుంటి బిచ్చయ్య, గాదె వెంకటయ్య, గండి భీమయ్య, గుంటి యాదయ్య, ఈశ్వరయ్య, వెంకటయ్య, సత్యయ్య, హన్మయ్య, ఆంజనేయులు, సాయిలు, మాజీ సర్పంచ్ గండి లక్ష్మణ్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ■ పచ్చదనం కోసం..



కొడంగల్, జులై 12: పచ్చదనం ఎక్కడ సమృద్ధిగా ఉంటుందో అక్కడ ఆహ్లాదకర వాతావరణంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం నెలకొంటున్నదని గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాంనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

## ■ పర్యావరణాన్ని కాపాడుదాం..



బషీరాబాద్, జూలై 12 : పర్యావరణాన్ని కాపాడాలని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైల్వార్, కంసాన్‌పల్లి(బి) గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఓ నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతుందన్నారు. నర్సరీలో ఉన్న ప్రతి మొక్కనూ నాటి కాపాడే బాధ్యత గ్రామ ప్రజలు తీసుకోవాలని సూచించారు.

## ■ వ్యర్థాల సేకరణకు వేలంపాట




వికారాబాద్, జూలై 12 : వికారాబాద్ పట్టణ పరిధిలోని చికెన్, మటన్ , చేపల వ్యర్థాల సేకరణకు గాను బహిరంగ వేలం నిర్వహించినట్లు వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని ఉదయం 10:30 గంటలకు కాన్ఫరెన్స్ హాలులో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంపాటలో ఐదుగురు వ్యక్తులు పాల్గొనగా రూ.3.25లక్షలకు ఓ వ్యక్తి దక్కించుకున్నాడు. జూలై 15, 2024 నుంచి 31 మార్చి, 2026 వరకు.. 8 నెలల 16 రోజుల కాలపరిమితితో అస్లం చాంద్ షేక్, మెరిన్ ఫుడ్స్ , ఫీడ్స్ ఇండస్ట్రీస్ టెండరు కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

# వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

కులకచర్ల, జూలై 12: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ ఐదు మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లో హరితవనమహోత్సవం ద్వారా మొక్కల పెంపకాన్ని తీవ్రతరం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, బ్లాక్2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, బచ్చిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

### అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

కులకచర్ల మండల కేంద్రంలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికీ చెక్కులను అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదన్నారు. ఏ ఒక్క లబ్ధిదారుడు తమకు పథకాలు అందడం లేదని నిరుత్సాహ పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

### వన మహోత్సవ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

వికారాబాద్, జూలై 12: వన మహోత్సవ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఐఎఫ్ఎస్, స్పెషల్ కమిషనర్, ఆర్డీ బి.షఫీవుల్లా ఎస్ పీఎం, ప్లాంటేషన్, వికారాబాద్ ఆర్డీ నర్సింగ్‌రావు తెలిపారు. శుక్రవారం వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామంలోని అవెన్యూ ప్లాంటేషన్, బృహత్ పల్లె ప్రకృతి వనం, పండ్ల తోటలు, వాటర్ షెడ్ (పీఎంకేఎస్‌వై) నందు చేపట్టిన అమృత్ సరోవర్ పనులను, సందర్శించారు. పూడూరు మండలం మిర్జాపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ, క్రీడా ప్రాంగణం పనులను పరిశీలించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో చేపట్టిన ఉపాధి హామీ పనుల పురోగతిపై చర్చించారు. ఈ కార్యక్రమం లో డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, ఎంపీడీవోలు, ఎంపీ వోలు, ఏపీవోలు, ఈసీలు, డీఆర్‌డీఏలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

# మహిళాభ్యున్నతికి సర్కార్ చేయూత

కొడంగల్, జూలై 12: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఎఫ్‌వో, మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో స్త్రీశక్తి కార్యక్రమాలపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు రూ. కోట్ల రుణాలను మంజూరు చేస్తున్నదని, లాభాలు చేకూరే వ్యాపారాలను చేసుకోవాలని సూచించారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం మహిళలకు మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవకాశాన్ని కల్పించిందని, అదేవిధంగా స్వశక్తితో ఎదిగే విధంగా చేతివృత్తి పనులకు గాను శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళల పొదుపు ఇంటిని ఏవిధంగా ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడుతుందో, అదేతరహాలో దేశం కూడా ముందుకు సాగే అవకాశం ఉంటుందన్నారు. మహిళా సంఘ సభ్యులు స్త్రీ శక్తి కార్యక్రమాలపై అవగాహన పెంచుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు అంజిలమ్మ, ఏపీఎం వెంకన్న, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్

# ఉపాధ్యాయులే సమాజ మార్గదర్శకులు

పెద్దేముల్, జూలై 12 : సమాజ మార్గద ర్శకులు ఉపాధ్యాయులేనని పెద్దేముల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అన్నపూర్ణ, అడికిచెర్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం పాండు రంగం అన్నారు. శుక్రవారం పెద్దేముల్ ప్రాథమిక పాఠశాల, అడికిచెర్ల ఉన్నత పాఠ శాలల్లో ఇటీవల బదిలీపై వచ్చిన, ప్రమో షన్లపై వెళ్లిన, ఇతర పాఠశాలల నుంచి బదిలీపై పాఠశాలలకు వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా పెద్దేముల్ ప్రాథమిక పాఠశాల నుంచి ఉపాధ్యాయులు శ్రీనివాసులు,వెంకటలక్ష్మి, నఫీజ్ సుల్తానా, సంగీతా, రాధ బదిలీపై వెళ్ల గా, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అన్నపూర్ణ, సంతోష, శిరీష, నజియా బేగం,రెహానాలు పాఠశాలకు వచ్చారు. అదే విధంగా అడికిచెర్ల ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై డి. శ్రీనివాస్, బి.జగన్, యూ. శ్రీనివాస్, సునీతా, సి.నరేందర్,పి.శ్రీవాణి వెళ్ల గా, బదిలీపై పాఠశాలకు విజయ్ కుమా ర్, రాఘవేందర్, సంధ్యారాణి, మాధవి, సురేశ్, పీఎస్ హెచ్ఎంకె. వీరేశం వచ్చా రు.కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపా ధ్యాయులు రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, బాల్‌రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



పెద్దేముల్‌మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం



పెద్దేముల్ అడికిచెర్ల ఉన్నత పాఠశాలలో...

### పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : మున్సిపల్ కమిషనర్

కొడంగల్, జూలై 12: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తెలిపారు. శుక్రవారం మున్సి పల్ పరిధిలోని ఆయా వార్డుల్లో మురుగు కాలువ శుభ్రత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను రోడ్డుపై పారవేయకుండా మున్సిపల్ వ్యాన్‌లలోనే వేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని పేర్కొన్నారు. మురుగు కాలువల్లో మురికి నీటి నిల్వ వల్ల దోమలు ప్రబలే ఆస్కారం ఉంటుందని, దోమ కాటు వల్ల అంటువ్యాధులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. మురికి నీరు నిల్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు.





కులకచర్ల, జూలై 12 : మండల పరిధిలోని కాము నిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గోరింటాకు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులకు గోరింటాకు పెట్టి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపా ధ్యాయురాలు పండరీబాయి, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### గురువులపై గురుతర బాధ్యత..

దోమ, జూలై 12: గురువులది గురుతరమైన బాధ్యత అని దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం దోమ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బదిలీపై వెళ్లిన హెచ్ఎం పురందాస్, ఆరుగురు ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించడంతో పాటు నూతనంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవో హరిశ్చందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఆంజనేయులు, ఇన్‌చార్జి హెచ్ఎం రాములు, మాజీ సర్పంచ్ రాంచం ద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని దిర్సంపల్లి ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన వెంకట్‌రెడ్డి, మొగులయ్య, రాంచంద్రారెడ్డి, బీమ్లా, భాగ్యమ్మ, తయ్యాబబేగంలను మాజీ సర్పంచ్ శాంతాకొండారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కేశవులు పాఠశాల చైర్మన్ గిరిజ, ఉపాధ్యాయులు సతీష్ కుమార్, బాలు, శేఖరయ్య, మేఘమాల పాల్గొన్నారు.

### మర్పల్లి ఎస్సైగా సురేశ్ బాధ్యతలు

మర్పల్లి, జూలై 12: మర్పల్లి పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా సురేశ్ శుక్ర వారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ రెడ్డి సెలవుపై వెళ్లడంతో సంగారెడ్డి జిల్లాలోని మునిపల్లి పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సురేశ్ మర్పల్లికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసులో భాగంగా ప్రతి ఒక్కరితో కలిసి మెలసి సమస్యలు పరిష్కరిస్తామన్నా రు. వాహనదారులు హెల్మెంట్ ధరించి వాహనం నడుపాలని, అన్ని పత్రాలను వెంటపెట్టుకో వాలని సూచించారు.

### కాశీలో తప్పిపోయిన బాలుడు..

# తల్లిదండ్రుల చెంతకు..

● నెల రోజుల మానసిక వేదనకు తెర ● ఆనందంలో కుటుంబ సభ్యులు



బాలుడితో తల్లిదండ్రులు, గ్రామస్తులు

కొడంగల్, జూలై 12: కాశీ యాత్రలో తప్పిపోయిన ఓ బాలుడు శుక్రవారం తల్లిదండ్రుల చెంతకు చేరుకున్నాడు. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన 40 మంది కళాకారులు నెల క్రితం అయోధ్యలో సంపూర్ణ రామాయణం వీధి నాటకం ప్రదర్శించడానికి వెళ్లారు. ప్రదర్శన అనంతరం కాశీలోని దైవదర్శనం నిమిత్తం వెళ్లారు. ఆ సమయంలో వడ్డె రాములు కుమారుడు బాలు తప్పిపోయాడు. బాలుడి కోసం ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు అయినా ఫలితం లేకపోవడంతో గ్రామానికి చేరుకున్నారు. అప్పటి నుంచి బాలుడి ఆచూకీ కోసం పోలీసులను ఫోన్ ద్వారా సంప్రదిస్తూ వచ్చారు. నాలుగు రోజుల క్రితం కొడుకు ఆచూకీ కోసం తండ్రి అయోధ్యకు వెళ్లాడు. బాలుడిని వెతుకుతున్న క్రమంలో బీహార్ రాష్ట్ర చిల్డ్రన్స్ హెల్ప్ లైన్ ద్వారా హైదరాబాద్, వికారాబాద్ అధికారులకు బాలుడు ఉన్నట్లు సమాచారం అందింది. బీహార్ చిల్డ్రన్ హెల్ప్ లైన్‌కు గ్రామస్తులతో పాటు తల్లిదండ్రులు చేరుకొని బాలుడిని గుర్తించారు. దాంతో బీహార్ చిల్డ్రన్ హెల్ప్ లైన్ వారు పూర్తి వివరాలను సేకరించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కన్న కొడుకు నెల రోజుల తరువాత కంట పడటంతో తల్లిదండ్రుల సంతోషానికి అవధులు లేవు.

### విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడి మృతి

పెద్దేముల్, జూలై 12 : విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతిచెందిన ఘటన పెద్దేముల్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఇందూరు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఇందూరు గ్రామ పంచాయతీలో దండె వెంకటప్ప(40) విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలో వీధి దీపాలను అమర్చడానికి పంచాయతీ సిబ్బంది విద్యుత్ అధికారుల నుంచి ఎల్‌సీ తీసుకున్నారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి ఆయా స్థంబాలకు బల్బులను అమర్చడం ప్రారంభించారు. దండె వెంకటప్ప ఆరేడు విద్యుత్ స్తంభాలకు బల్బులు అమర్చాడు.గ్రామంలోని బీసీ కాలనీలో హనుమాన్ దేవాలయం నుంచి స్మశానవాటికకు వెళ్లే మార్గంలో ఉన్న ఓ విద్యుత్ స్తంభానికి బల్బును అమర్చడానికి స్తంభం ఎక్కగా విద్యుత్ సరఫరా అయి వెంకటప్ప స్తంభం పై నుంచి కిందకు పడిపోగా తలకు బలమైన గాయం అయింది.దీంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు.

### చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

బషీరాబాద్, జూలై 12 : చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన ఘటన బషీరాబాద్ మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జీవన్గీ బర్కల్‌కు చెందిన హాజీబాబా (30) అనే యువకుడు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో కలిసి గురువారం చేపల వేటకు కాగ్నా చెక్ డ్యాంకు వెళ్లారు. ఇద్దరు వ్యక్తులు కొంత దూరంలో చేపల వేట చేస్తుండగా, హాజీబాబా మరో చోటుకు చేపల వేటకు వెళ్లాడు. కొంత సమయం తరువాత ఇద్దరు వ్యక్తులు వచ్చి చూడగా హాజీబాబా కనిపించలేదు. ఒడ్డుకు బట్టలు, చెప్పులు కనిపించడంతో కుటుంబీకులకు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు, కుటుంబీకులు చెక్ డ్యాంలోకి దిగి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం గ్రామస్తులు, కుటుంబీకులు చెక్ డ్యాం వద్దకు వెళ్లి గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమయింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### బైక్‌ను లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి

బంట్వారం, జూలై 12: బైక్‌పైన వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ స్రవంతి కథనం ప్రకారం..ధారూరు మండలం అవుసపల్లికి చెందిన పరిగి లాలయ్య తన భార్యను బైక్ పైన తల్లి గారి ఇంటికి పంపించి, తిరిగి వస్తుండగా, కోట్‌పల్లి మండలం ఓగ్లపూర్ గేట్ సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో లాలయ్యకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తాండూరు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి అన్న పరిగి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు చెప్పారు.

### పొలానికి వెళ్లి వస్తానన్న వ్యక్తి అదృశ్యం

పెద్దేముల్, జూలై 12 : పొలానికి వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ఓ వ్యక్తి అదృశ్యం అయిన ఘటన శుక్రవారం పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రుక్మాపూర్‌లో గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి కథనం ప్రకారం.....మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన మొగులప్ప అనే వ్యక్తి సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేస్తూ మద్యానికి బానిస అయ్యాడు. అయితే ఈ నెల తొమ్మిదిన ఉదయం 10 గంటలకు పొలానికి వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు . తిరిగి రాకపోవడంతో భార్య శ్రీలత, కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతకగా ఫలితం లేదు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తును చేస్తున్నట్లు ఎస్ఐ కె.గిరి తెలిపారు.

### నిషేధిత గుట్కాలు స్వాధీనం

పెద్దేముల్, జులై 12 :మండల కేంద్రంలో శుక్రవారం నిషేధిత గుట్కాలు అమ్ము తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఉదయం 10 గంటల సమయంలో సిబ్బందితో కలిసి మండల కేంద్రానికి చెందిన చాకలి సురేశ్ కిరాణా దుకాణంపై దాడులు నిర్వహించగా తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన 1680 గుట్కా పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు. వీటి విలువ సుమారు రూ.3710 ఉంటుందని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గిరి తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
TOURS & TRAVELS



★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962